నమస్తే తెలంగాణ
# కరీంనగర్
3 కరీంనగర్, సోమవారం 21 ఏప్రిల్ 2025 KARIMNAGAR

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, ఏప్రిల్ 20 : అకాల వర్షాలు, ఈదురు గాలులతో కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాల్లోని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. చేతికి వచ్చిన వరి, మామిడి పంటలు దెబ్బతిన్నాయని, కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం పూర్తిగా తడిచిపోయిందని ఆవేదన చెందారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒక్క కోరుట్ల నియోజకవర్గంలోనే 12 వేల ఎకరాల్లో వరి, మామిడి, మక్క, నువ్వు, సజ్జ పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన చెందారు. ఇబ్రహీంపట్నం మండలంలో 6 వేల ఎకరాల్లో పంటలు పోయాయన్నారు. జగిత్యాల జిల్లాలోని మిగతా మండలాల్లోనూ పంటనష్టం వాటిల్లిందని వాపోయారు. పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని కోరారు.

## సభతో సత్తా చాటుదాం

- బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు

కథలాపూర్, ఏప్రిల్ 20 : రజతోత్సవ సభతో బీఆర్ఎస్ సత్తా చాటుదామని, వేడుకల్లో గులాబీ దళం బలం చూపిద్దామని పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పిలుపునిచ్చారు. ఆదివారం కథలాపూర్ మండలకేంద్రంలోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని, రజతోత్సవ సభ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తి కావడం సంతోషకరంగా ఉందన్నారు. సభకు ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులు సభ కోసం సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అంతకుముందు కోరుట్లలో సిరికొండ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడి ప్రైవేట్ దవాఖానను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మామిడిపెల్లి రవి, గంధ్ర కిరణ్‌రావు, గడ్డం భూమారెడ్డి, కేసరి సాయన్న, దొప్పల జలేందర్, వంగ రవీందర్, శీలం మోహన్ రెడ్డి, సోమ దేవేందర్ రెడ్డి, ఏజీబీ మహేందర్, తిరుజానీ, రవీందర్ నాయక్, సీతరాంనాయక్, శేఖర్, చీటి విద్యాసాగర్‌రావు, మేడిపెల్లి సాయిరెడ్డి, గంగారెడ్డి, జిల్లా రాజు, గంగారెడ్డి, పాలెపు నర్సయ్య, జెల్ల వేణుగోపాల్ యాదవ్, కోలి నరేందర్ పాల్గొన్నారు.


సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు, నాయకులు

# ఆఖిరి 'తడి' కోసం తండ్లాట

- జూలపల్లి మండలంలో ఎండుతున్న పంటలు
- యాసంగిలో ఆలస్యంగా వెయ్యి ఎకరాల్లో వరి, మక్క సాగు
- చేతికందే దశలో నిలిచిన ఎస్సారెస్పీ నీటి సరఫరా
- కాపాడుకునేందుకు రైతుల అవస్థలు
- చివరి తడి ఇవ్వాలని వేడుకోలు

ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు రైతాంగం తల్లడిల్లుతున్నది. చేతికందే దశలో ఉన్న పంటలకు సాగు నీటి కోసం అరిగోస పడుతున్నది. అందుకు జూలపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని పంటల దుస్థితే నిదర్శనంగా నిలుస్తుండగా, రైతన్నకు కన్నీరే మిగులుతున్నది. ఈ సీజన్‌లో మండల కేంద్రంతోపాటు కుమ్మరికుంట, వడ్కాపూర్, కాచాపూర్, వెంకట్రావ్‌పల్లి రైతులు దాదాపు వెయ్యి ఎకరాల్లో వరి, మక్క సాగు చేయగా, కోతకు వచ్చే సమయంలోనే ఎస్సారెస్పీ అధికారులు ఇటీవల నీటి సరఫరా బంద్ చేయడం సమస్యగా మారింది. ఎక్కడికక్కడ పంటలు ఎండిపోతూ, నేలలు నెర్రెలు బారుతుండగా, సాగు నీటి కోసం కర్షకులు తండ్లాడుతున్నారు. చివరి తడి ఇచ్చి ఆదుకోవాలని అర్థిస్తున్నారు.


జూలపల్లిలో ఎండిపోతున్న మక్క చేను


నెర్రెలు వారిన పొలం

జూలపల్లి, ఏప్రిల్ 20: జూలపల్లి మండలానికి ఎస్సారెస్పీ నీరే ఆధారం. చివరి ఆయకట్టులో ఉంటుంది. ఇక్కడి రైతులు ఎన్నోఏళ్లుగా కాలువ నీళ్లనే నమ్ముకొని ఎవుసం చేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ యాసంగిలో 12,667 ఎకరాలలో వరి, 4,085 ఎకరాల్లో మక్క సాగు చేశారు. అయితే జూలపల్లి, కుమ్మరికుంట, వడ్కాపూర్, కాచాపూర్, వెంకట్రావ్‌పల్లి తదితర గ్రామాల్లో ఈ యాసంగిలో ఆలస్యంగా పంటలు వేశారు. దాదాపు వెయ్యి ఎకరాల్లో సాగు చేశారు. ఎప్పటిలాగే ఈ నెలాఖరు దాకా నీళ్లు వస్తాయని భావించారు. అయితే ఎస్సారెస్పీ డీ-83, 86 ప్రధాన కాల్వల నుంచి నీటి సరఫరాను అధికారులు నిలిపివేయడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. ప్రస్తుతం చేతికందే దశలో పంటలకు ఆఖరి తడి ఇవ్వకపోతే తీవ్రంగా నష్టపోతామని, వెంటనే నీరందించాలని కోరుతున్నారు. సాగు నీరందక కండ్ల ముందు పంటలు ఎండిపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. పంటలు కోతకు వచ్చే చివరి దశలో నీరందక చేజారిపోతున్నాయని ఆందోళన చెందుతున్నారు. అధికారుల్లో చలనం లేకపోవడంతో రెండ్రోజుల కింద మండల కేంద్రంలోని తహసీల్ ఆఫీస్ ఎదుట ఆందోళన చేశారు. వెంటనే నీరందించాలని డిమాండ్ చేశారు. అయినా పట్టించుకోకపోవడంతో కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని సాగునీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.

### నీళ్లు కొనుక్కొని పారిస్తున్న



నాకు జూలపల్లిల 20 గుంటల భూమి ఉంది. వరి సాగు చేసుకుంటూ బతుకుత. చేతికందే టైంలనే గీ నడుమ ఆఫీసర్లు కెనాల్ నీళ్లు బంద్ చేసిన్రు. పంట ఎండిపోతంది. ఇంకో తడి నీళ్లు ఇస్తే చేతికి అందుతది. పక్కపొంటి రైతుకు చెందిన వ్యవసాయ బావి నుంచి సాగునీరు వాడుకుంటున్నా. ఒక్క తడి నీళ్లకు ₹2 వేలు ఇచ్చుకుంటున్న. నీళ్ల కోసం ఆఫీసర్లు పట్టించుకోవాలె. ఇంకో వారం రోజులు నీళ్లస్తేగానీ వరి, మక్క చేతికందేటట్టు లేదు.

**- పాటకుల లక్ష్మణ్, రైతు (జూలపల్లి)**

### కౌలు పైసలన్నా అచ్చేటట్టు లేవు



మాది కుమ్మరికుంట. నేను ఏడున్నర ఎకరాల భూమి కౌలుకు తీసుకుని మక్క సాగు చేసుకుంటున్న. చేనుకు కెనాల్ నీళ్లే ఆధారం. ఆఫీసర్లు నీళ్లు బంద్ చేసిన్రు. పంటంతా ఎండిపోతంది. ఈ మధ్య వడగండ్ల వానకు మక్క చేను కొంత దెబ్బతిన్నది. ఇప్పుడున్న కొద్దిపంట దక్కించుకోడానికి సాగునీరు కరువైంది. గతేడాది గిట్ల లేదు. ఇప్పుడైతే పశువులకు వదిలిపెట్టుడే. వ్యవసాయ బావులు దగ్గర లేవు. ఒక్కతడి నీళ్లు పెడితే పంట చేతికి అందేది. కనీసం కౌలు పైసల మందమన్న పంట పండేటట్లు కనిపించడం లేదు. అధికారులు కెనాల్ నీళ్లు ఇచ్చి పంటల్ని కాపాడాలే.

**-కందుల లచ్చయ్య, రైతు (కుమ్మరికుంట)**

# ఎల్ఆర్ఎస్.. క్లియరెన్స్ ఎప్పుడో?

- ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలు
- దరఖాస్తుదారులకు తప్పని తిప్పలు
- పరిష్కారం కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

**కరీంనగర్ నగరపాలక సంస్థలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం కరువవుతున్నది. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలతో దరఖాస్తుదారులు ఆఫీస్ చుట్టూ తిరగాల్సి వస్తున్నది. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని ఉన్నతాధికారులు చెబుతున్నా.. అందులో అధికారులు ఉండడం లేదని అర్జీదారులు మండిపడుతున్నారు. అందుబాటులో ఉండి సందేహాలను తీర్చాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు కనీసం కార్యాలయంవైపు కన్నెత్తి చూడడం లేదని వాపోతున్నారు.**


టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద సిబ్బంది లేకపోవడంతో వేచి ఉన్న దరఖాస్తుదారులు

కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 20 : రాష్ట్ర ప్రభుత్వ వన్‌టైం సెటిల్‌మెంట్ కింద స్థలాలు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు 25 శాతం రాయితీ అవకాశం ఇచ్చింది. గత నెల 31తో ఈ గడువు ముగియగా, మరోసారి ఈ నెలాఖరు వరకు పొడిగించింది. అయితే, ఎల్ఆర్ఎస్‌లో అనేక సాంకేతిక సమస్యలు వస్తుండడంతో దరఖాస్తుదారులు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కనీసం సమాచారం కూడా ఇచ్చే వారు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నిజానికి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించే విషయంలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు (ఎల్-1) అధికారులు స్థలం ప్లాట్ దగ్గరకు వెళ్లి యాప్‌లో ఆ వివరాలను నమోదు చేయాలి. అనంతరం ఫీజు కట్టిన తర్వాత ఎల్-1 అధికారి అప్‌లోడ్ చేస్తే టీపీవో (ఎల్-2) అధికారి దానిని పరిశీలించి అప్‌లోడ్ చేయాలి. తర్వాత కమిషనర్ (ఎల్-3) లాగిన్‌కు వెళ్తుంది. వారు ఓకే చేస్తే ప్రొసీడింగ్స్ వస్తాయి. కానీ, పలు దరఖాస్తుదారులకు ఎల్-1 అధికారి పరిశీలించిన తర్వాత దరఖాస్తుదారుడు ఫీజు కడితే ఎల్-2లో ఆమోదించిన తర్వాత ఎల్-3 లాగిన్‌కు వెళ్లకుండా మళ్లీ ఎల్-1కే వెళ్తుండడంతో దరఖాస్తుదారులు గందరగోళానికి గురవుతున్నారు. మరికొందరికి పూర్తిస్థాయిలో ఫీజు చెల్లించిన తర్వాత మళ్లీ డాక్యుమెంట్స్ అప్‌లోడ్ చేయాలని రావడం.. అవి చేసినా మళ్లీ ఎల్-1, ఎల్-2 మధ్యలోనే ఆన్‌లైన్‌లో చూపించడంతో ఏమిచేయాలో అర్థంకాక దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. అసలు ఈ సమస్యలపై కార్యాలయంలోనూ సరైన సమాధానం ఇచ్చే వారు లేకుండా పోయారు.

### ముడుపుల దందా

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో ఎల్-1 అధికారులు స్థలం, ప్లాట్ దగ్గరకు వెళ్లి యాప్‌లో ఆ స్థలానికి సంబంధించిన వివరాలతోపాటు దరఖాస్తుదారుడి పూర్తి వివరాలు నమోదు చేయాల్సి ఉండగా ఈ విషయంలో జాప్యం జరుగుతున్నది. కాగా, కొందరు అధికారులు ఈ పనులు వేగంగా చేపట్టేందుకు తమ వద్ద ఉన్న చైన్‌మెన్లను వినియోగిస్తున్నారు. అయితే, ఈ అప్‌లోడ్ విషయంలో ఈ చైన్‌మెన్లు ముడుపుల దందాకు తెర లేపారన్న ఆరోపణలు వస్తున్నాయి. క్షేత్రస్థాయిలో స్థల పరిశీలనకు రావాలని కార్యాలయం చుట్టూ తిరిగితే, ఎంతో కొంత ముట్టజెప్పితేనే చైన్‌మెన్లు వస్తున్నారని పలువురు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. ఒక్కో ఫైల్‌కు రూ.వెయ్యి నుంచి ₹3 వేల వరకు ముడుపులు డిమాండ్ చేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటివరకు నగరపాలక సంస్థలో 24,019 దరఖాస్తులు రాగా, ఇప్పటికే 5867మంది ఫీజులు చెల్లించారు. అందులో 1654 మందికి ప్రొసీడింగ్‌లు జారీ కాగా, ఇతర మున్సిపాలిటీల్లో 8,315 దరఖాస్తులకు 1850 మంది ఫీజు చెల్లించారు. 784 ప్రొసీడింగ్‌లు జారీ చేయగా, సుడాలో 9873 రాగా 1869 మంది ఫీజులు చెల్లించారు. 473 ప్రొసీడింగ్‌లు ఇచ్చారు.

### దరఖాస్తుదారుల ప్రదక్షిణలు

సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం వచ్చే దరఖాస్తుదారులకు సరైన సమాధానం దొరకడం లేదు. టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ విభాగంలో ఏ అధికారి కూడా సాయంత్రం వరకు కార్యాలయం వైపు కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలున్నాయి. మరోవైపు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటు చేశామని చెబుతున్న ఉన్నతాధికారులు వాటిలో ఓ అధికారి, సిబ్బంది కూడా కనీసం కనిపించడం లేదు. దీంతో కార్యాలయం చుట్టూ తిరిగి వెళ్లడం తప్ప ఏమీ చేయలేకపోతున్నామని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న సిబ్బందిని తమ సందేహాలపై అడిగితే సరైన సమాధానం ఇవ్వకుండానే తిప్పించుకుంటున్నారని మండిపడుతున్నారు.

### పదిహేను రోజులైనా ఒక్క గింజా కొనలే..

..పక్క చిత్రంలో ధాన్యం రాశులతో కనిపిస్తున్నది సిరిసిల్ల అర్బన్ మండలం పెద్దూరు ఐకేపీ సెంటర్. రైతులు ధాన్యం తెచ్చి పదిహేను రోజులు అవుతున్నా ఒక్క గింజా కొనకపోవడంతో కుప్పలు తెప్పలుగా పోగుపడుతున్నాయి. అయితే కొనుగోళ్ల ప్రారంభానికి ఇంకెన్ని రోజులు పడుతుందో తెలియకపోవడం, మరోవైపు అకాల భయం వెంటాడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏం చేయాలో తెలియక దళారులకు అగ్గువకే క్వింటాల్ ₹1800 నుంచి ₹1900కే అమ్ముకుంటున్నారు. ఇదే అదనుగా దళారులు సైతం ఐకేపీ సెంటర్ సమీపంలోనే కాంటా పెట్టి కొనుగోలు చేస్తున్నారు. ఇలా ఈ ఒక్క చోటే కాదు జిల్లాలోని మెజార్టీ కొనుగోలు కేంద్రాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 75వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దళారుల పరమైనట్లు తెలుస్తున్నది


సిరిసిల్ల అర్బన్ మండలం పెద్దూరులోని ఐకేపీ సెంటర్‌లో పదిహేను రోజులుగా పేరుకుపోయిన ధాన్యం కుప్పలు

# కేంద్రాలు తెరిచారు.. కొనుగోళ్లు మరిచారు

**అధికారుల నిర్లక్ష్యం.. ధాన్యం దళారుల పరం**

- సెంటర్లలో కుప్పలు తెప్పలుగా వడ్ల రాశులు
- పదిహేను రోజులైనా కాంటా వేయని వైనం
- కేంద్రాలు ప్రారంభమవుతున్నా.. అంతంతే కొనుగోళ్లు
- రైతులకు తప్పని తిప్పలు
- రాత్రిళ్లు కుప్పల వద్దే పడిగాపులు
- 'అకాల' భయంతో అగ్గువకే అమ్ముకోవాల్సిన దుస్థితి

ధాన్యం దళారుల పాలవుతున్నది. కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యం.. పట్టింపులేమితో మధ్య వ్యాపారుల పంట పడుతున్నది. కేంద్రాలకు వడ్లు తెచ్చి రోజులు గడుస్తున్నా కాంటా పెట్టకపోవడంతో పంట కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నది. సిరిసిల్ల జిల్లాలో ఈ సీజన్‌లో 241 సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన యంత్రాంగం, ఇప్పటివరకు 139 మాత్రమే ప్రారంభించింది. అందులోనూ కొన్నింట మాత్రమే కొనుగోళ్లు మొదలు పెట్టి అంతంతమాత్రమే సేకరిస్తుండడంతో కంటిమీద కునుకు లేకుండా పోతున్నది. రాత్రిళ్లు కేంద్రాల వద్దే పడిగాపులు పడుతూ, అకాల భయంతో వ్యాపారులకు అగ్గువకే అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురిస్తున్నది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, వేగవంతం చేయాలని రైతాంగం కోరుతున్నది.


సిరిసిల్ల అర్బన్ మండలం పెద్దూరులోని సెంటర్‌లో కొనుగోలు ప్రారంభించక పోవడంతో ధాన్యం దళారులకు అమ్ముకుంటున్న రైతులు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ అధ్వానంగా మారింది. రైతులు కేంద్రాలకు వడ్లు తెచ్చి పదిహేను రోజులైనా కాంటా పెట్టకపోవడం మధ్య దళారులకు కాసుల పంట పండిస్తున్నది. ఓ వైపు అకాల వర్షంతో ధాన్యం తడిసి ముద్దవుతుండగా, కాపాడుకోలేక రైతాంగం అవస్థలు పడుతున్నది. రోజుల తరబడి వేచిచూడలేక మద్దతు ధర కన్నా తుట్టికే అమ్ముకుంటూ నష్ట పోతున్నది. పండించిన పంటకు మద్దతు ధర కల్పిస్తామంటూ సర్కారు చేసిన ప్రచార పటాటోపం తప్ప ఒరిగిందేమి లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నది. సిరిసిల్ల జిల్లాలో ఈ సీజన్‌లో 4 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని మార్కెటింగ్ శాఖ అంచనా వేసింది. అందు కోసం 255 గ్రామ పంచాయతీల పరిధిలో 241 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. కానీ, కోతలు మొదలై పదిహేను రోజులు గడిచిన తర్వాత ఇప్పటివరకు కేవలం 139 సెంటర్లు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండడంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

### కేవలం 7వేల మెట్రిక్ టన్నుల్లే సేకరణ

కేసీఆర్ ప్రభుత్వం వరి కోతలకు ముందే కొనుగోళ్లపై పక్కా ప్రణాళికతో ముందుకు పోయింది. 255పంచాయతీలుంటే 265సెంటర్లతో కల్లాల వద్దే కాంటాలు పెట్టి కొనుగోళ్లు వేగవంతం చేసింది. రైస్ మిల్లర్లతో ముందస్తు చర్చలు జరిపి వెంట వెంట గోదాములకు తరలించేలా చర్యలు తీసుకున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొనుగోళ్ల ప్రక్రియ ఆగమైందని, రాను రాను అధ్వానంగా మారిందని రైతులు మండిపడుతున్నారు. గత 2024 యాసంగిలో ఏప్రిల్ 18 వరకు 18,186.220మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్న అధికారులు, ఈ సీజన్‌లో కేవలం 139 సెంటర్లు మాత్రమే ప్రారంభించి తూతూమంత్రంగా కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటివరకు కేవలం 7,823.120 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు.

### వడగళ్ల భయం

కొనుగోళ్లలో వేగం పెంచకపోవడంతో కేంద్రాల్లోనే ధాన్యం పేరుకుపోతున్నది. రైతులు రాత్రిళ్లు పడిగాపులు కాయాల్సిన దుస్థితి. మరోవైపు రైతన్నకు వడగండ్ల వాన భయం పట్టుకున్నది. ఇటీవల కురిసిన వానలకు మెజార్టీ కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయిపోవడంతో కన్నీరే మిగిలింది. ధాన్యం పరిశీలించిన అధికారులు తేమ ఉందని, ఆరే వరకు కొనుగోలు చేయమని చెబుతున్న నేపథ్యంలో మరో పదిరోజులు ఆరపెట్టాల్సిందే. ఈలోగా మళ్లీ వర్షాలు పడితే ధాన్యం తడుస్తున్నది. ఇదే తంతు కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో రైతులు దళారులకు అగ్గువకే అమ్ముకుంటున్నారు. క్వింటాల్ ₹1800, ₹1900కే తుట్టికే అమ్ముకుంటూ నష్టపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 75వేల మెట్రిక్ టన్నులు దళారీలకు అమ్ముకున్నట్లు తెలుస్తున్నది.

## ఆడుకుంటూ మృత్యుఒడికి


- కారు ఢీకొని మూడేండ్ల బాలుడి దుర్మరణం
- ఖని శివారు గంగానగర్‌లో ఘటన


శివరాజ్‌కుమార్ (ఫైల్)

ఫర్టిలైజర్‌సిటీ, ఏప్రిల్ 20: అప్పటిదాకా కండ్లముందు ఆడుకుంటున్న బాలుడు అనుకోని రీతిలో మృత్యుఒడికి చేరాడు. ఒక్కసారిగా రోడ్డుపైకి వెళ్లడంతో కారు ఢీకొని ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ముత్తారం మండలం మచ్చపేటకు చెందిన పులిపాక రమేశ్, సంధ్య దంపతులకు కొడుకు శివరాజ్‌కుమార్ (3), మూడు నెలల పాప ఉన్నారు. రమేశ్ కొండగట్టు జేఎన్టీయూలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అయితే సంధ్య పాప పుట్టినప్పటి నుంచి తన తల్లిగారిల్లు అయిన రామగుండం నగర శివారులోని గంగానగర్‌లో కొడుకుతో ఉంటున్నది. ఆదివారం శివరాజ్ ఇంటి ఆవరణలో ఆడుకుంటూ ఉన్నాడు. అంతలోనే ఒక్కసారి రోడ్‌పైకి వెళ్లాడు. ఈ సమయంలో మంచిర్యాల నుంచి గంగానగర్‌కు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బంధువులు గోదావరిఖనిలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా అప్పటికే మృతి చెందాడు. తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన గంగానగర్‌కు చెందిన కారు డ్రైవర్ ఎం వెంకటేశ్‌పై వన్‌టౌన్ ఎస్ఐ భూమేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సభకు ఉప్పెనలా కదలాలి

- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్

చిగురుమామిడి, ఏప్రిల్ 20: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు హుస్నాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు, అభిమానులు ఉప్పెనలా కదిలి రావాలని హుస్నాబాద్ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం తన స్వగ్రామమైన హుజూరాబాద్ మండలం సింగాపూర్‌లో ముఖ్య నాయకులతో మాట్లాడారు. ఈనెల 27న అన్ని గ్రామాల్లో గులాబీ జెండాలను ఆవిష్కరించాలని, అనంతరం బహిరంగ సభకు వేలాదిగా తరలిరావాలని కోరారు. సభ విజయవంతానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉన్నారని, కేవలం పదహారు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భరించలేకపోతున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. సమావేశంలో భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, చిగురుమామిడి, హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట, మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## బొట్టు పెట్టి.. సభకు ఆహ్వానిస్తూ..

- రజతోత్సవ సభకు రావాలని కోరిన బీఆర్ఎస్ మహిళా నాయకులు


కిసాన్‌నగర్‌లో మహిళకు బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ మహిళా నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్, ఏప్రిల్ 20 : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్ద సంఖ్యలో మహిళలు తరలిరావాలని కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌లో ఆదివారం పార్టీ మహిళా నాయకురాళ్లు ఇంటింటికీ వెళ్లి బొట్టు పెట్టి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంతోనే తెలంగాణ రాష్ట్ర సాధన సాధ్యమైందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దేశంలోనే తెలంగాణను అగ్రభాగన నిలిపిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకులు సుల్తానా, సావనపల్లి నారాయణమ్మ, సిరిపురం లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

## 'ఒక ప్రస్థానం' పుస్తకావిష్కరణ


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ మంత్రులు మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్

కరీంనగర్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొప్పుల ఈశ్వర్ 50 ఏళ్ల రాజకీయ ప్రస్థానంపై 'ఒక ప్రస్థానం' పేరుతో పెద్దపల్లికి చెందిన ప్రముఖ రచయిత నూతి మల్లన్న రచించిన పుస్తకాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని జలవిహార్‌లో పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు. కొప్పుల ఈశ్వర్ 67వ జన్మదినం సందర్భంగా సాయంత్రం తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కొప్పుల ఈశ్వర్‌తోపాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, జగదీశ్వర్‌రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ మంత్రులు మహమూద్ అలీ, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుకంటి చందర్, పుట్ట మధూకర్, సుంకె రవిశంకర్, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పుస్తక పరిచయ సభ నిర్వహించారు.



పుస్తకం చదువుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు